


## నాపై ఆరోపణలు రుజువు చేసేందుకు...
# ఎమ్మెల్యే ఆనం బహిరంగ వేదికకు సిద్ధమా!

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, డిసెంబరు 30 ప్రభాతవార్త: తనపై ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన ఆరోపణలకు తాను బహిరంగ విచారణకు సిద్ధంగా ఉన్నానని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. 2014 ఎన్నికల్లో తాను పరారయ్యానని చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవదని అన్ని సర్వేలు చెప్పినా తాను పోటీ చేసి నిలబడ్డానని తెలిపారు. ఆత్మకూరులో ఆనం పోటీ చేసి ఓటమి చెందిన తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారని తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డితో కూడా అనుకూలంగా వ్యవహరించారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో తనకు 5వేల ఓట్లు వచ్చాయని, ఆత్మకూరులో మంత్రిగా ఉండి ఆనంకు 8వేల ఓట్లు వచ్చాయన్నారు. తెలుగుదేశం అభ్యర్థి 5వేలు ఓట్లు మాత్రంతోనే వెంకటగిరిలో గెలవగా ఆత్మకూరులో వైసీపీ అభ్యర్థి 30వేల ఓట్లతో గెలిచారని వివరించారు. వెంకటగిరి నియోజకవర్గంలో తమ కుటుంబానికి 40 సంవత్సరాల అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. తండ్రి జనార్థన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిసి సీఎం అయ్యారని, అమ్మ రెండు సార్లు ఎమ్మెల్యే అయి మంచిగా చేశారని తెలిపారు. తాను ఎమ్మెల్యే సీటు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సూచన మేరకు పని చేస్తానని చెప్పారు. ఎస్‌ఎస్ కెనాల్ పనులు ఎందుకు ఆగాయో ఆయనకు తెలుసు అన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులలు కాంట్రాక్టర్లు ఎందుకు ఆపారో అందరికీ తెలుసని విమర్శించారు. తన పని చేస్తున్న ఆరోపణలకు బహిరంగ విచారణకైనా ఎదురెదురుగా మాట్లాడేదానికైనా సిద్ధమని తెలిపారు. డిసెంబరు 5వ తేదీ తిరుపతిలో పార్టీ పరిశీలకులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నృత్యకళల బోర్డు చైర్మన్ శిరీష, వైసీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ఢిల్లీబాబు, వయిదా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా X తెలుగుదేశం

- నంజంపేటలో 'దేశం' నేతలపై వైకాపా దాడి
- ఇదేం ఖర్మ కార్యక్రమంకు వెళ్తున్న వారిని అడ్డగించిన వైకాపా శ్రేణులు - 'దేశం' వర్గీయుల 10 కార్లు ధ్వంసం
- ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలకు గాయాలు



ఘర్షణ పడుతున్న టిడిపి, వైకాపా కార్యకర్తలు

సోమల, డిసెంబర్ 30 ప్రభాత వార్త: మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అడ్డా పుంగనూరు నియోజకవర్గంలో వైకాపా నేతలు తెలుగుదేశం నాయకులపై శుక్ర వారం దాడికి పాల్పడ్డారు. సోమల మండ లంలోని నంజంపేటలో శుక్రవారం తెలుగు దేశం నాయకులు భారీ కాన్వాయ్‌తో ఇదేం ఖర్మరా బాబు కార్యక్రమం నిర్వహించడానికి వెళ్తుండగా నంజంపేట గ్రామ పొలిమేరల్లోనే వైకాపా నాయకులు దేశం నాయకులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో తెలుగుదేశం నాయకులకు చెందిన పది కార్ల వరకు ధ్వంసం అయ్యారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సదుం ఎస్ఐ మారుతి, సోమల ఎస్ఐ లక్ష్మీకాంత్‌లు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలం చేరుకొని ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ చల్లా బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు సోమల మండలం నంజంపేట గ్రామంలో శుక్రవారం ఇదేం ఖర్మరా బాబు కార్యక్రమం చేపట్టడానికి పుంగనూరు నుండి భారీ వాహనాల కాన్వాయ్‌తో బయలుదేరారు. నంజంపేటకు తెలుగుదేశం నాయకులు వస్తున్న సమాచారం తెలుసుకొన్న జడ్పీటీసీ అమాస మోహన్, ఎంపిపి ఈశ్వరయ్య, సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ నాగేశ్వర్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, జయరామ్, ఎంపిటిసీలు మహ్మద్ జిన్నా, నాగభూషణంరెడ్డిల అధ్వర్యంలో వైకాపా నాయకులు తెలుగుదేశం నాయకుల వాహనాలు గ్రామంలోకి వెళ్ళకుండా అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణ మాఫీ చేపట్టకుండా మోసం చేసిందని ప్రస్తుత ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశంను అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోందని వైకాపా నాయకులు తెలుగుదేశం నాయకులతో వాగ్వివాదంకు దిగారు. గ్రామంలోకి వెళ్ళకుండా వెనక్కి వెళ్ళాలని వైకాపా నాయకులు తెలుగుదేశం నాయకులకు స్పష్టం చేయడంతో ఇరు పార్టీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ పరిస్థితుల్లో వైకాపా నాయకులు తెలుగుదేశం నాయకులపై రాళ్ళ దాడికి పాల్పడటంతో దేశం నాయకులు వచ్చిన వాటిలో 10 కార్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. పుంగనూరు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ చల్లా బాబు కారు ఎక్కువ భాగం ధ్వంసం అయ్యింది. నంజంపేట గ్రామ పొలిమేర్లలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ నెలకొందని పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి సదుం ఎస్ఐ మారుతి, సోమల ఎస్ఐ లక్ష్మీకాంత్‌లు సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకోవడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఈ దాడుల్లో గాయపడ్డ వైకాపా నాయకులు, కార్యకర్తలు సోమల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందగా దేశం నాయకులు పుంగనూరుకు వెళ్ళిపోయారు. ఈ వ్యవహారంపై సోమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇన్‌ఛార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు!

- పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా కుర్చీలు
- ఇన్‌ఛార్జీ అధికారులకు తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఓజిలి, డిసెంబర్ 30 ప్రభాతవార్త : పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలని గొప్పగా చెప్పుకుంటారే తప్ప ఆచరణలో మానరతం అందుకు భిన్నంగా కొనసాగుతోంది. గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌ఛార్జి అధికారులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ కార్యదర్శికి సుమారు రెండు మూడు గ్రామాలు చొప్పున కేటాయించడంతో ఏ గ్రామానికి పంచాయతీ కార్యదర్శి వెళుతున్నాడో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పల్లె ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి చొప్పున ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటేనే పల్లె సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఓజిలి మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 19 పంచాయతీలకు కార్యదర్శులు ఉన్నారు. మండల పరిధిలో దాదాపు జూన్ నెల నుంచి ఓజిలి, కుందాం, అత్తివరం, తిరుమలపూడి, క్రబల్లవోలు, ఇనుగుంట, చిల్లమానుచేను ఇన్‌ఛార్జి కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తుండటంతో ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. మిగతా ఆరు గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు లేరు. మిగిలిన ఏడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులే ఇన్‌ఛార్జిలుగా నియమించారు. ఒక పంచాయతీ కార్యదర్శికి ఒక గ్రామం కాకుండా రెండు మూడు గ్రామాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు ఎప్పుడు ఏ గ్రామంలో ఉంటారో తెలియని అయోమయ పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో జనన, మరణ ధ్రువీకరణలకు తప్పనిసరిగా కార్యదర్శిని కలవాల్సి ఉంటుంది. వివాహ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డులు, కొత్తగా నిర్మించే ఇళ్లకు అనుమతి కోసం, విద్యుత్ కనెక్షన్ వంటి వివిధ పనుల నిమిత్తం కార్యదర్శిని కలవాల్సిందే. కానీ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి మరోలా ఉంది. ప్రతి సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమీక్ష సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో గ్రామాల్లో అందుబాటులో ఉంటున్నామని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఇన్‌ఛార్జి గ్రామాల సంఖ్య ఒకటి కంటే ఎక్కువ అప్పగించారు. సకాలంలో అధికారులు ప్రజలకు సేవలు అందించలేక పోతున్నామనే భావన వారిలో ఉంది.

## వైకాపా పాలనలో...
# ప్రతి ఇంటికీ లబ్ది

విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త : వైకాపా పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ లబ్ది చేకూరిందని విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. పల్లె బాటలో భాగంగా మండలం లోని ఆమినిగుంట, పందిళ్ళ పల్లి, పెద్దయల్లకుంట్ల, కాగతి, కాటిపేరి పంచాయతీల్లోని 40 గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాలల్లో కొనసాగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా మరిన్ని సంక్షేమ ఫలాలు అందించి ప్రజామన్నలను పొందామన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేపట్టని కార్యక్రమాలు చేపట్టి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నామన్నారు. ఆర్‌బికే కేంద్రాలు, గ్రామ సచివాలయాలు వంటివి అమలు కోసం ప్రపంచ దేశాలు అధ్యయనం చేస్తున్నాయంటే వైకాపా పాలన ఏపాటిదో అర్థమవుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజీలేని చర్యలు తీసుకొంటున్నామనీ, శక్తిక్షేత్రం బోయ కొండపై మరో 30యేళ్ళల్లో చేయబోయే అభివృద్ధిని ఇప్పుడే చేసి చూపిస్తున్నా మన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే కాలంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా ప్రజామద్దత్తు వైకాపా వుండేలా చర్యలు తీసుకోవాలని ఆయన దిగువశ్రేణి నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలోనూ మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతి పళ్ళాలతో స్వాగతం పలికి ఆయనకు పూలబాట పరిచారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. సమస్యలే లేని గ్రామాలుగా పల్లె ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నారనీ, తమ మద్దత్తు పెద్దిరెడ్డికే ఉంటుందని ప్రజలు ఆయనకు భరోసా ఇస్తున్నారు. పలు గ్రామాల్లో ఆర్‌బికే, సచివాలయ, అంగన్‌వాడీ భవనాలను ఆయన జాతికి అంకితం చేసారు. జడ్పీ ఛేర్మన్ జి.శ్రీనివాసులు, రాష్ట్ర ఆర్టీసీ ఉపాధ్యక్షుడు విజయానందరెడ్డి, జడ్పీ ఉపాధ్యక్షుడు ధనుంజ యరెడ్డి, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ ఎన్.దామోధర్‌రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, బోయకొండ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఉపాధ్యక్షులు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, తొండ శ్రీరాములు, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం ఐదు గ్రామాల జనాగ్రహం

- పలమనేరు-పుంగనూరు జాతీయరహదారిలో భారీ ధర్నా -ఎంపిడీఓ హామీతో ధర్నావిరమణ, -పిల్లల చదువులు సాగేదేలా అంటూ నిరసన



జాతీయంహదారిపై ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపంజాణి డిసెంబర్ 30 ప్రభాతవార్త : ఏళ్ళతరబడి తమగ్రామాలకు రోడ్డుసౌకర్యం లేకపోవడంతో ఐదు గ్రామాల ప్రజల్లో ఆగ్రహంకట్టలు తెంచుకుంది. గతంలోనే తమగ్రామాలకు తారురోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పలితం లేకపోవడంతో శుక్రవారం ఐదు గ్రామాల ప్రజలుఏకమై పలమనేరు - పుంగనూరు జాతీయరహరిలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌తీవ్ర అంతరాయం కలిగింది. చివరకు ఎంపిడీఓ శ్రీనివాస్ విశ్వనాథ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ తరుపున త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెనుతిరిగారు. ఈ సంఘటనకు సంబందించి వివరాలిలా.. మండలంలోని చలమంగళం పంచాయతీ పరిధిలోని సూలేరుగుట్ట, దిగువ ముద్దేపల్లి, ఎగువముద్దేపల్లి, వడ్డూరు, గడ్డంవారిపల్లి ప్రజలకు గతకొన్నేళ్ళుగా మట్టిరోడ్డు సౌకర్యం మాత్రమే ఉంది. తరచూ వర్షాలు పడితే ఈ మార్గాల్లో ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క విద్యార్థులు ఐదారు కిలోమీటర్లలోఉన్న పాఠశాలకు ఈ మార్గం గుండానే వెళాల్సి వస్తోంది. తమ గ్రామానికి రోడ్డుసౌకర్యం కల్పించాలని పలు మార్లు అధికార పార్టీనేతలను కోరినా అంతకుముందు తెలుగుదేశంపార్టీ నాయకులను కోరినా తమ గోడుపట్టించుకోక వదిలేసారన్నారు. రోడ్డుసౌకర్యం లేక ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే సైతం అంబులెన్సులు, ఆటోలు సైతం వచ్చేందుకు వెనుకడుగు వేస్తుంటాయని ఆవేధనవ్యక్తం చేసారు. గ్రామాల్లో ఎవరైనా మహిళలను కాన్పులకు ప్రభుత్వఆస్పత్రికి తరలించాలంటే తాము పడుతున్న బాధ వర్ణనాతీతమని పేర్కొన్నారు. తమ గ్రామానికి రోడ్డుసౌకర్యం కల్పించడంలో ప్రజాప్రతినిధులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. తాము ప్రజలుకాదా తమకు ఓట్లులేవా అంటూ వచ్చిన స్థానికనేతలను నిలదీసారు. చివరకు ఎంపీడీఓ అక్కడకు చేరుకొని గ్రామస్థులతో చర్చించారు. గతంలోనే సుమారు రూ.2.50 కోట్లతో రోడ్డుపనులు మంజూరు అయ్యాయని అయితే సాంకేతిక సమస్యలవల్ల, కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణం చేపట్టలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడా శిరిడిలో ఉన్నారని ఆయన రాగానే సమస్యను వివరించి త్వరితగతిన రోడ్డును ఏర్పాటుఅయ్యేలా చూస్తామన్నారు.

జిల్లా ఉన్నత అధికారులుకు ఈ విషయంగా సమాచారం అందించానని ఆయన పేర్కొనడంతో గ్రామస్తులు శాంతించి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో శంకరప్ప, మూర్తి, కృష్ణప్ప, శ్రీనివాసులు, మెగిలప్ప, అమర్‌నాథ్, గంగులయ్య, వెంకటేశు, అప్పయ్య, చిన్నరెడ్డెప్ప, వెంకటేశు, శంకర భారీఎత్తున మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శుభ్రమైన గ్రామాలతోనే ప్రజా ఆరోగ్య సాధన

తిరుపతిరూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: చెత్తలేని శుభ్రమైన గ్రామాలతోనే ప్రజా ఆరోగ్యాన్ని సాధించవచ్చునని, ఇదే జగనన్న స్వచ్ఛ సంకల్పమని అడిషనల్ కమిషనర్ సుధాకరరావు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతిజిల్లా, తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని మోడల్‌గా ప్రదర్శించారు. ఈసందర్భంగా కమిషనర్ పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్యధర్శి మదుసూధన్‌ను అభినందించారు. పొడి చెత్త, తడి చెత్త నిర్వాహణపై 13 జిల్లాలలో గల ఆదర్శ గ్రామాల నుండి ఇవో పిఆర్డీలు హజరయ్యారు. తిరుపతిరూరల్ మండల ఇవో పిఆర్డీ నీలకంఠేశ్వరరెడ్డి, పెరుమాళ్ళపల్లి పంచాయతీ కార్యధర్శి మదుసూధన్, గ్రేడ్-5 కార్యధర్శి జానకిరామ్ హజరయ్యారు. తిరుపతి జిల్లాలో పెరుమాళ్ళపల్లి, సత్యవేడులలో తడి చెత్త, పొడి చెత్త సంపద కేంద్రాలను గుర్తించి, డివిజనల్ స్థాయి శిక్షణా కేంద్రాలుగా గుర్తింపు ఇచ్చారు. ఘన చెత్త, ద్రవ చెత్త, ప్రమాదకర చెత్త నిర్వాహణ, శాస్త్రీయ పద్ధతులు ఎలా అవలంభించాలి అనే వాటిపై అవగాహన కల్పించారు.

## "గోవిందా"...
# స్థానికుల పట్ల 'కరుణ' ఏదీ!?

-వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ ప్రత్యేక కౌంటర్లు ఇవ్వండి !

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**

దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆనందనిలయం పక్కనే ఉన్న పవిత్ర మోక్షమార్గం వైకుంఠ ద్వార దర్శనం స్థానికులకు కల్పించడంలో టిటిడి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉదాసీనత చూపుతున్నారని పలువురు తిరుపతి స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎంతో పవిత్రమైన ఈ మోక్షమార్గం దర్శనం కోసం రోజువారీగా ఆఫ్‌లైన్‌లో జారీచేయనున్న ఉచిత సర్వదర్శన టోకెన్లను స్థానికులకు ప్రత్యేకంగా కేటాయించేవారని, ఈ ఏడాది ఆ విధానం అమలుచేయలేకపోవడం బాధాకరమని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసిన వైకుంఠద్వార దర్శన సర్వదర్శనం టోకెన్లను తొలుత స్థానికులకే ప్రాధాన్యత కల్పించిన విషయం టిటిడి అధికారులు మరచిపోతే ఎలాఅని అంటున్నారు. దీనిపై టిటిడి బోర్డు సభ్యులుగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, తుడ ఛైర్మన్‌డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా సానుకూలంగా స్థానికులపట్ల స్పందించకపోవడం పట్ల గగ్గోలుపెడుతున్నారు. ఎన్నికల సమయంలో స్థానికులు గుర్తుకు వచ్చే ప్రజాప్రతినిధులకు కనీసం దేవుని దర్శనంలో గుర్తుకు రామా?అని విరుచుకుపడుతున్నారు. గుంపులో గోవిందా అని స్థానికులు కూడా తిరుపతిలో టిటిడి టిక్కెట్లు కౌంటర్ల వద్ద బారులు తీరి బయటి ప్రాంతాల భక్తులతో బాటు పడిగాపులు కాయడం ఎంతవరకు మంచిదనేది తెలుసుకోవాలని అంటున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా తిరుపతిలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో తొమ్మిదిప్రాంతాల్లో ఉచిత సర్వదర్శన టోకెన్లను రోజుకు 50వేల టోకెన్లు జారీకి టిటిడి సిద్ధమైంది. అయితే ఈ టోకెన్లను తిరుపతి వాసులతోబాటు ఇతర ప్రాంతాలు, బయటి రాష్ట్రాల భక్తులకు ఆధార్‌కార్డు గుర్తింపుతో జారీచేసేలా టిటిడి చర్యలు తీసుకుంది. అయితే ఇవి ఎంతవరకు తిరుపతినగరవాసులకు లభిస్తాయనేది మాత్రం స్థానికుల్లో అనుమానం, అసహనం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది భిన్నంగా అందరికీ టోకెన్లుఅంటే స్థానికుల మాటేమటనే వాదన వినిపిస్తోంది. తుడ కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానం, రామచంద్రపుష్కరిణి, శ్రీనివాసం, బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ కేంద్రాల్లోని కౌంటర్లలో తిరుపతి వాసులకే వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీచేయడం కొంతవరకు మంచిదనే అభిప్రాయాన్ని అధికశాతంమంది స్థానికులు వెలిబుస్తు న్నారు. ఈ విషయంగా స్థానిక ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి చొరవచూపాలని కోరుతున్నారు. మరీ దీనిపై శనివారం, ఆదివారం మధ్యాహ్నం లోపు టిటిడి అధికారులు, స్థానిక బోర్డు సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాల్సిందే.

## రేపు అర్ధరాత్రి తెరుచుకొనున్న వైకుంఠ ద్వారం

ఎంతో పవిత్రమైన, ప్రాధాన్యత ఉన్న వైకుంఠద్వారాలు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత సోమవారం వేకువజామున తిరుమల వెంకన్న ఆలయంలో తెరచుకోనున్నాయి. ప్రతి సంవత్సరంలాగే రానున్న ఏడాదిలో కూడా తిరుమలకు చేరుకున్న ప్రముఖులకు వేకువజామున 2గంటలకే దర్శనం కల్పిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శన టిక్కెట్లు పొందిన భక్తులను వైకుంఠద్వార దర్శనాలకు అనుమతించనున్నారు. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో రెండులక్షలమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుని భారీగా గోవింద మాలలు ధరించి గోవింద నామాలతో తిరుమల మారుమోగేది. భక్తులకు టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పించేవారు. అయితే గత ఏడాది నుంచి పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు కల్పించడం, సామాన్యభక్తులకు ప్రాధాన్యత నిచ్చి సర్వదర్శనం ఆఫ్‌లైన్ టోకెన్లు 5లక్షల వరకు జారీచేయడం, వైకుంఠద్వార దర్శనాలకు జనవరి 2నుంచి 11వ తేదీ వరకు పదిరోజుల పాటు రోజుకు 80వేలమంది వరకు భక్తులకు అనుమతించనుండటంతో టిక్కెట్లు, టోకెన్లు ఉన్న భక్తులనే ఆలయంలోపలకు అనుమతిస్తారు.

## నూతన సంవత్సరానికి...
# కాణిపాకం సన్నద్ధం

-దేవాదాయశాఖ ఆదేశాలతో అలంకరణలు నిల్ -కూలైన్లు, బందోబస్తుతో సరి
-వేకువజామున 4 గంటల నుండే సర్వదర్శనం

కాణిపాకం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ ఆదేశాలతో ప్రత్యేక అలంకరణ, ఏర్పాట్లు లేకుండానే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నూతన సంవత్సరానికి సన్నద్ధమైంది. ప్రతి ఏటా నూతన సంవత్సరాదికి విఘ్ననాయకుడైన గణనాధుని దర్శనార్థం లక్షలాది మంది భక్తులు తరలిరావడం ఆనవాయితీ. సంవత్సరాది రోజున విఘ్ననాదుని దర్శించుకుంటే అంతా శుభాలే కలుగుతాయని భక్తుల విశ్వాసం. దీనితో జిల్లా నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుండి కూడా భక్తులు స్వామి దర్శనార్థం పెద్దఎత్తున తరలి వస్తుంటారు. ఇందుకోసం కాణిపాకం ఆలయం సంవత్సరాదికి సన్నద్ధమైంది. అయితే భారతీయ సంప్రదాయాలను వదిలి ప్రాశ్యాత్య సంప్రదాయాలకు పట్టం కడుతూ జనవరి 1న పండుగలు చేసుకోవడం భారతీయ వైధిక విధానం కాదని, కావున భక్తులు సమర్పించే కానుకలను అలంకరణలకు ఆర్భాటాలకు ఖర్చు చేసి ఆలయాల వద్ద పండుగ వాతావరణం సృష్టించడం సరికాదని, కేవలం భక్తులకు సాధారణ ఏర్పాట్లు మాత్రమే చేయాలన్న కమీషనర్ ఆదేశాలతో 2017 నుండి ఆలయంలో సంవత్సరాదికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం లేదు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ అధికారులు కేవలం సాధారణ ఏర్పాట్లు మాత్రమే చేపట్టారు. ఈమేరకు ఆలయ దర్శనార్థం భక్తులు స్వామివారిని త్వరితగతిన దర్శనం చేసుకునేందుకు వీలుగా సర్వదర్శనంతో పాటు 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనంలకు వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వేకువ జామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం వేకువజామున 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సర్వదర్శనం కల్పిస్తున్నారు. ఇదిలా వుండగా ఆలయం వద్ద ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టక పోగా, ప్రధాన ఆలయంలో జరిగే అన్ని అర్జిత సేవలను రద్దు చేశారు. అదేవిధంగా ఆలయం వద్ద భక్తుల రద్దీదృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



**నూతన సంవత్సరాదికి ఏర్పాట్లు పూర్తి: ఛైర్మన్, ఈఓలు :**

నూతన సంవత్సరాది సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేపట్ట పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరాది రోజున స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే ఆవకాశ మున్నందున దేవస్థానం వద్ద ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా కావలసిన ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు త్వరితగతిన స్వామి దర్శనం కల్పించేందుకు ఉచిత దర్శనంతో పాటు 100 శీఘ్రదర్శనం, 150 అతి శీఘ్రదర్శనం భక్తు లకు వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆలయ దర్శనార్థం వచ్చే విఐపీలకు ఉదయం 8.30 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 3.30 గంటల నుండి 5 గంటల వరకు టైంస్లాట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విఐపీలు ఉభయదారులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లులో వెళ్ళి స్వామివారిని దర్శించుకోవచ్చునని ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. అలాగే భక్తులు అన్న ప్రసాదాలు, స్వామివారి ప్రసాదాలను, త్రాగునీటి వసతిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంవత్సరాది రోజు, జనవరి 2 వైకుంఠ ఏకాదశి రోజుల్లో ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి రోజుల్లో భక్తులు కరోనా నిబంధనలను మేరకు మాస్కులు ధరించి సామాజిక దూరం పాటిస్తూ స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు.



ప్రత్యేక క్యూలైన్లను పరిశీలిస్తున్న ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి

